# ముదురుపోని చదువు



పెద్దింటి రామమూర్తి & లక్ష్మణ్

నేను, శర్మ, శాస్త్రి ప్రాణ స్నేహితులం. అవసరమొస్తే ఒకరి ప్రాణాన్ని ఇంకొరికి అడ్డం వేసుకుంటాము. చిన్నప్పుడు ఒకటవ తరగతినుంచి నేడు స్కూలు ఫైనలువరకు ఒకేవిధంగా వస్తున్నాము. ఏం తిన్నా ముగ్గురం కలిసే తింటాము. తిండయినా, దెబ్బలయినా.

ఒక్కరిగావుంటే ఒంటిపిర్రి రాకాసని ఇద్దరైతే రావణ కుంభకర్ణులని, నలుగురుగా తిరిగితే దుష్టచతుష్టయమని పేరెడతారు. ముగ్గురుగావుంటే ఏమనగలరు? అందుకని మా మిత్ర బృందంలోకి కొత్తవారిని చేర్చటంగాని ఉన్నవారిని పోనివ్వటంగాని జరగలేదు. జరగదు. అయినా మూడుకు ఎంతో ప్రత్యేకత వుంది. ఆ పల్లోలో ప్రయాణం చేసే యాత్రికులు ముగ్గురు. గాంధీగారు ఉపయోగించిన కోతులు మూడు. సినిమాల్లో కూడా ముగ్గురిపైనే కథ హీరో, హీరోయిన్, విలన్. ఆఖరికి కుటుంబనియంత్రణలో పిల్లలకు లిమిటు మూడు. ఇంకా చెప్పాలంటే రిక్షాకు చక్రాలు, ఫానుకు రెక్కలు, గడియారానికి ముళ్ళు, శివుడికి కళ్ళు; అన్నీ మూడే. ఇలా చెప్పాలంటే ఎన్నో.

నా పేరు రావు. లెక్కలు రావు. నేను చూసిన సినిమాలు లెక్కలేవు. మొదటి ఆట మొదటిక్లాసుకు (ముందునుంచి) మొదటి టిక్కట్టు నేనే తీసుకోవాలి. దీని వల్ల ఎన్ని చొక్కాలు చిరిగాయో చెప్పలేను. మిత్రబృందంలో రెండవవాడు శాస్త్రి. కొంచెం పిరికి. ప్రపంచం అంటే ఏమిటో ఇప్పుడిప్పుడే మా దగ్గరనుంచి తెలుసుకుంటున్నాడు.

మా ఇద్దరికన్న కొంచెం ప్రత్యేకత వున్నవాడు శర్మ. తెల్లకాగితాలను నల్లకాగితాలుగా మార్చగలడు. పాపం అదేం శాపమోగాని పేదుపంపిన ఒక్కకథైనా ఒక్క పత్రిక కూడా తీసుకునేది కాదు. ఇలా కాదని కొన్నాళ్ళు, కొన్ని కథల్లోలాగ అక్క పేరో, చెల్లెమ్మ పేరు పెట్టి పంపి చూసాడు. కొందరి పేరు మోసిన రచయితుల పేర్లు పెట్టి చూసాడు. లాభం లేక పోయింది. దీనితో వూరుకునుంటాడనుకొంటున్నారా! తరువాత బెదిరింపు ఉత్తరాలు వ్రాసి పంపేవాడు. 'నాకు కలలోకి వెంకన్న వచ్చి ఈ కథ చెప్పాడు. ఆ కథే ఏ అక్షరం పొల్లు పోకుండా రాసి పంపుతున్నాను. దీనిని ప్రచురించని యెడల వెంకన్నకు అపచారం చేసినట్లవుతుంది. మీ తలలపై ఒక్క వెంట్రుక కూడా నిలవకుండా పూడుతుంది.' కాని వాళ్ళు మరీ గడుసు పిండాల్లా వున్నారు. కథ తిప్పి పంపుతూ మా పత్రికలో పని

చేసే చాలా మందికి పూర్తిగా బట్టతలలే. అందుచే, మీ కథను జుట్టున్న వాళ్ళు వేసే పత్రికకు పంపుకోండని జవాబిచ్చారు.

కథలు తిప్పి పంపడానికి బోలెడు డబ్బు తగలేసేవాడు. పోస్టువాను వెనక్కు తెచ్చిచ్చినప్పుడు రెండురోజులు ఇంట్లో కూర్చుని ఏడ్చేవాడు. ఇక అప్పటి నుంచి 'రిటర్న్ పోస్టేజి' పెట్టడం మానేసాడు. తిరుగున్న వాళ్ళెవరెవరైనా ఏం శర్మా నీ కథలేమయినా పడ్డాయాని అడుగుతే, 'అసలు నా కథలు పత్రికకు చేరుతున్నాయో, లేవో తెలియటం లేదండి. ఈ పోస్టలు డిపార్టుమెంటుంది చూసారూ...' అని చిన్న లెక్చరు దంచేవాడు. ఇది నిజమేమోనని అవతల వాళ్ళు జాలిపడేవారు.

ఆ సంవత్సరమే మా స్కూల్లో ఎన్.సి.సి పెట్టారు. ఎవరు చేరినా చేరక పోయినా మేమునటుకు తప్పకుండా చేర దలచుకున్నాము. పెద్ద ఆసక్తి వుండి చేరామనుకునేరు. దీనివల్ల చాలా లాభాలు వున్నాయి. మొదటిది అదనంగా రెండు జతల బట్టలొస్తాయి. రెండోది. చలి కాలానికి ఈ బట్టలు తొడుక్కుంటే వెచ్చగా వుంటాయి. మూడవది ఆటలకి, చాకలి బట్టలు తీసుకురానప్పుడు ఇవి ఆదుకొంటాయి. ఫ్రీగా టిఫిన్లు నాలగవది.

బట్టలు తీసుకున్నాము. చొక్కా వేసుకుంటే నిక్కరవసరంలేదు. అంత పొడుగుంది చొక్కా. పైగా ఆ లాగూ చొక్కా తొడుక్కుంటే పదిరోజులు జ్వరంలోపడ లేచి, వాళ్ళలా వున్నాము. అయినా పైన చెప్పిన లాభాలముందు ఇదేం అంత బాధించలేదు.

మర్నాడు సాయంకాలం ఎన్సీసీకి వెళుతున్నాము. దారిలో ఓ పెద్దమనిషి పిలిచాడు. అటువైపు నడిచాము మెట్లదగ్గిరే ఆపి 'ఆగాగు అక్కడే వుండండి. ఏమయ్యా బుద్ధిలేదూ?' అంటూ మొదలెట్టాడు. ఈ అనుకోని సంఘటనకు బిత్తర పోయాము.

'ఈ ఇంటిముందర చెత్త చూడండి. తీసి నెలరోజులవుతుంది. ఇంతవరకు ఇటె వరు వచ్చినపాపాన పోలేదూ. అసలు ఉద్యోగాలు మీ కెవడిచ్చాడు? మీ ఆఫీసరుకు రిపోర్టు ఇస్తాను' అని ఎగరసాగాడు. ఇంకా రాయకూడని మాటలు చాలా అన్నాక 'ఊ...ఊ వీధంతా తుడవండి. పావలా పారేస్తాను' అదరిచాడు.

నాకు కోపం వచ్చింది 'ఏమయ్యోయ్! మేం ఎవరనుకుంటున్నావ్?' మేము తల పడ్డాము. ఇంకా నలుగురు పోగయ్యారు. అందరూ మమ్మల్నేలెట్టి బలవంతంగా చీపుర్లు అంటగట్టారు చెప్పేది విని పించుకోకుండా వీధంతా వూడిపించారు లేచేసరికి నడ్డులు పట్టుకుపోయాయి. ఆ వీధిలో అదృష్టవశాత్తూ మాకుతెలిసి నాయన అటురావటం జరిగింది

'అరెరె: ఏమిటయ్యా? ఈపనులు మీరు చేస్తున్నారని మేము ఫలానావారి కొడుకుల మని చెప్పాడు వాళ్ళతో. వాళ్ళాశ్చర్యపోయి, 'మరి ముందు చెప్పలేదేం? ఆ బట్టలు ఆ అవతారంచూసి మున్సిపాలిటీవాళ్లనుకొన్నాము' అని క్షమాపణ చెప్పుకొన్నారు. అపుడు తెలిసింది చేసిన పొరపాటు. టోపీలు పెట్టుకురావటం మర్చిపోయాం. బూట్లు కొరుకుతున్నాయని ఇంట్లో వుంచేశాము. 'ఫర్వాలేదండి. సంఘసేవే కదా' అని ఏడ్వలేక నవ్వి బయట పడ్డాము.

ఆయనలా రాకపోతే ఇంకా ఏం శుభ్రపరచమనే వాళ్ళోకదా. ఆ రోజే ఎన్సీసికి స్వస్తి పలికాము.

స్కూలు ఎలక్షన్లు వచ్చాయి స్కూలు లీడరు పదవికి ఎన్నికలు జరగబోతున్నాయి. నేను తప్పకుండా నిలవాలని నిశ్చయించుకున్నాను. ఎందుకనుకుంటున్నారేమో. 'విద్యార్థుల నిధి' అంతా వీడి చేతుల్లోనే వుంటుంది. ఎంత డబ్బయినా దాన్లోంచి లెక్కా పక్కా లేకుండా కొట్టెయ్యవచ్చు. ఎన్ని సినిమాలకయినా చెక్కేయ్యొచ్చు. ఇదేం పాడుబుద్ధి అనుకోవచ్చు. నేటి బాలురేకదా రేపటి నాయకులు!

దీనికికూడా కొంతడబ్బు ఖర్చుపెట్టాలి. కాగితాలు అచ్చువేయించటం, టీ పిన్లు పెట్టించటం మొదలైనవి వీటన్నిటికి డబ్బడిగితే నాన్న తంతాడు. అందుకని అవతలి వాడి ఎన్నికల కాగితాలపైన నా పేర్లు వ్రాసి పంచసాగాము. ఎలక్షను కాయితాలతో పుస్తకాలు కుట్టుకుని వాడే విద్యార్థులకి ఇది బాధాకరంగా పరిణమించింది. ఈ సంగతి అవతలవాడికి చెప్పినట్టున్నారు. వాడు రెండువక్కలా తన పేరు అచ్చేయించుకోసాగాడు. చెరపకురా చెడేవంటా రెందుకే. దీనివలన వాళ్ళూ నేనూ నష్టపోయాము.

ఎన్నికలరోజు రానే వచ్చింది. పసిపాపకు పాలపీక చూపితే ఓటువేసే కాలమిది. పైగా వాడు పరీక్షలు లేకుండా పాసు చేయిస్తా నటం అందరికి నచ్చినట్టుంది. వాడికి నూరు వేల ఓట్లుపడితే నాకు ముప్పటగా, మా అభిమాన సంఖ్య మూడు ఓట్లు వచ్చాయి. అవి ఎవరేసుంటారో తెలుసుకునే వుంటారు ఈ అవమాన భారంతో తలెత్తుకోలేకపోయా కొన్నాళ్ళు. కానీ దీనివల్ల నయినా పదిమందిలో నా పేరు పడిందికదాని సంతృప్తిపడి వూరట చెందాను.

ఇంతలో మూడునెలల పరీక్షలొచ్చాయి. ఇంకా చాలామంది పుస్తకాలే కొనలేదు. కొన్నవారింకా అట్టలు వేయటంలోనే వున్నారు. అప్పుడేనా పరీక్షలు! వానా కాలం వచ్చిన పరీక్షలకు మా వానాకాలం చదువులకి సరిగ్గాజత కుదిరింది. సెలవు లిచ్చారు.

ఆ సెలవులకు ఢిల్లీనుంచి శాస్త్రి వాళ్ళ మామయ్యకూతురు శశి వచ్చింది. నేను, శర్మ ఓ సాయంత్రం వాడింటి కెళ్ళాము. ఆ అమ్మాయి పంజాబీదుస్తులేసుకుంది. తెలుగురానట్టే వాళ్ళనాన్నతో హిందీలో మాట్లాడుతూంది. ఇద్దరు తమిళులు కలిసినా, ఇద్దరు మళయాళీలు కలసినా తమ తమ భాషల్లోనే ఎంతో ఆప్యాయంగా మాట్లాడుకుంటారు. కాని ఇద్దరు తెలుగువాళ్ళు కలిస్తే చస్తే తెలుగులో మాట్లాడుకోరు.

'వీళ్లే నా స్నేహితులు' శాస్త్రి అన్నాడు.

'నా పేరు శర్మ' సవినయంగా పరిచయం చేసుకున్నాడు.

'చచ్చా' అందామ్మాయి. గతుక్కుమన్నాను. ఎంత ఢిల్లీనుంచి వస్తేమాత్రం ఎందుకలా నోరు పారేసుకోడం? వాడు మొహం మాడ్చుకుని కూర్చున్నాడు.

తెలుగులో నైతే ఆ అమ్మాయికి అర్థం కాదేమోనని, 'మే రా నా మ్ రా వు హై' అన్నాను సాధ్యమైనంత స్టయిలుగా. ఆఖరిలో హుంకరించి నట్లనిపించింది.

ఆ అమ్మాయి కిలకిలా నవ్వేసి, 'బహుత్ చచ్చా. చచ్చా' అంది. ఒళ్ళు మండింది అంత చావడానికి నా పేరులో ఏముంది ? నీపేరు శశి, మసిబోసి. కసిదీరా తిట్టుకున్నా మనసులో.

ఇంతలో శాస్త్రి మామయ్యొచ్చి అటుగా వచ్చి నేనలా వెళ్ళొస్తా శశీ అన్నారు. 'చచ్చా డాడీ' అందామ్మాయి. అప్పుడు తెలిసింది ఇది అచ్ఛా అయుండొచ్చునని. ఉత్తర హిందూదేశంనుంచి వచ్చే నూటికి తొంభైమందికి ఈ అలవా టుంటుందని.

'మనమేదైనా షినామ్కు పోదామా ?' అంది అక్కడేవున్న ఇంగ్లీషు పేపరు తిరగేస్తూ. మాటలు కొంచెం ముద్దుగా, ముద్దగా వున్నాయి.

'మంచిచేడుకు పోదామా?' అడిగింది. మంచి చేదేమిటి ? చెడ్డ చేదేమిటి ? సినిమాల పుట్టుయిన నాకు ఆ సినిమా అసలు పుట్టిందో లేదో తెలియలేదు.

శర్మ తేరుకొని 'మంచీ—చెడూ' అని సరిచేసాడు. ఇన్ని సినిమాలు చూసిన నాకు ఇది తెలియక పోవటం చిన్నతన మనిపించింది. ఏదో మాట్లాడాలి 'ఇంగ్లీషులో 'డ' అని అక్షరం వున్నప్పుడు దానిని తెలుగులో 'డ' అని చదవాలి' చెప్పాను. నావైపు కృతజ్ఞతగా చూసి, మళ్లీ పేపర్లో తలదూర్చింది.

'పోనీ రాజూపేడకు వెళదామా?,అడిగింది. అవుది, గేదెది విన్నాకాని ఇదెప్పుడూ వినలేదే. మళ్లీ శర్మే ఈసారికూడా 'రాజా—పేద' అని సరిచేసి పకపక నవ్వాడు 'మరి రావుగారట్లా షెప్పారే' అంది నావైపు కొరకొరాచూస్తూ. నాతల కొట్టేసినంత పనయింది. వాళ్లిద్దరూ గొల్లుమన్నారు అంటే నవ్వారు. మళ్లీ వాళ్ళ సంభాషణలో జోక్యం చేసుకోలేదు.

సెలవులయిపోయాయి. స్కూళ్ళు తెరిచారు. స్కూలుకు తనిఖీజరిగే రోజు లొచ్చాయి. అందరు పిల్లలు సంచీలు పట్టనన్ని పుస్తకాలు మోసుకొచ్చారు. మా తరగతి వాళ్ళు తప్ప అన్ని తరగతుల పిల్లలు తమ తమ గదులను శుభ్రంగా వుంచారు. మావాళ్ళు వట్టి బద్ధకస్తులు. మా మాస్టారు తెలివి మంత్రులనేవారిని అక్కడక్కడ సరివారు. డి. ఇ. ఒ. గారు వచ్చేసరికి క్లాసంతా సంతలావుంది.

# కుదురులేని...

ఆయన వచ్చీ రాగానే క్లాసునుచూసి, 'ఇదేమిటిలావుంది? పాఠశాలనా పశువుల శాలనా' అని గొంతుచించు కరిచారు.

'చెరసాల' శర్మ కీచుగొంతుతో అరిచాడు.

'ఎవరది?' గద్దించారు. మాస్టారుగారు కంగారు పడిపోతున్నారు. ఎవరూ మాటాడలేదు.

'మీరు చెప్పకపోయినా నేను పట్టుకోగలను' అని ఓమారు పళ్ళుకొరికి, 'మీ తరగతిలో అస్తమానం వాగేవారు, నిల్చొనేవారు, ఇతరులను కొట్టేవారు ఎవరో చెప్పండి?' అన్నారు విద్యార్థుల నుద్దేశించి

శాస్త్రిలేచి నించున్నాడు. దొంగను పట్టేసానన్నట్లు ఒకసారి కాలరు సవరించి మాస్టారువైపు గర్వంగా చూసి, శాస్త్రి వేపుచూసి నువ్వేనాని అడిగారు.

'కాదండీ' శాస్త్రి జవాబిచ్చాడు.

'మరెవరు ? ఫర్వాలేదు చెప్పు' అభయమిచ్చారు.

తమపేర్లు ఎక్కడ చెప్పేస్తాడో అని అల్లరిపిల్లలు భయపడి పోతున్నారు

'మా మాస్టారు.'

క్లాసంతా గగ్గోలయి పోయింది. మాస్టారి మొహం ఈస్ట్మన్ రంగులోకి మారిపోయింది. తరువాత వాడి వీపుమీద రెండుగుద్దులు పడ్డాయనుకోండి. అదివేరే సంగతి. కాని శాస్త్రి తెలివికి సాహసానికి ఇదో గీటురాయిగా నిలిచింది.

అరునెలల పరీక్షలు దగ్గర కొస్తున్నాయి. మూడునెలల పరీక్షలు చెడిపినందుకు ఈ పరీక్షలయినా బాగా రాయాలని నిశ్చయించు కొన్నాము. శాస్త్రి, శర్మ మా ఇంట్లోనే, నాకని ఒక గదివుండేది కాబట్టివచ్చి చదువుకునేవారు. ఎంతమేలుకుందామనుకున్నా రాత్రి తొమ్మిదికంతా నిద్ర ముంచుకొచ్చేది. మా అవస్థచూచి అక్కయ్య ఒక కిటుకుచెప్పింది. వేడి టీ తాగుతే నిద్రరాదని ఎంతసేపయినా చదుపుకో వచ్చుని.

'ఈ రోజునుంచే ఈ పద్ధతవలంబిస్తా నక్కా' అన్నా, చెప్పంగానే మాట విన్నందుకు మహా సంతోషపడి పోయిందామె. తనే టీ కాచి ఫ్లాస్కులో పోసి తెచ్చిచ్చింది కూడా. కాని పాపం తనకేం తెలుసు మాకునచ్చిన విషయం టీ తాగడం అని.

టీ తాగంగానే నిద్ర మరీ ఎక్కువయి పోయింది. ఇది తెలిస్తే మళ్లీ టీ కాచివ్వదని తలుపులు బిగాయించి లోపల దీపం వుంచి ముసుగుతన్నాము ఇలా కొన్నిదినాలు జరిగాయి. కాని ఈ ప్లాను అట్టేకాలం సాగలేదు. ఓ రోజు ఫ్లాస్కుకోసం తిరిగి వచ్చి మేము నిద్రపోవడం గమనించిందట. గాఢనిద్రలోవున్న మాకు ఆమె తలుపులు బాదటం వినిపించలేదు. మర్నాడునుంచి టీ పెట్టివ్వటం మానేసింది.

మరునాడు తొమ్మిదయింది. నిద్రవస్తున్నట్లనిపిస్తుంది. పడుకుంటే నిద్దరాదు. అలవాటయిన ప్రాణాలు. టీ తాగుతే, కాని నిద్ర వచ్చేటట్లు లేదు. అక్కయ్యకు మా మీద ఎలాగూ నమ్మకం పోయింది. ముగ్గురం సైకిలు తీసుకొని దూరంలో వున్న హోటలుకు వెళ్లాము. వేడి, వేడి (టే) నీరు సేవించాము

శర్మ అమాంతం టేబిలుమీదపడి నిద్రపోసాగాడు. మా ఇద్దరి పరిస్థితి ఇంచుమించు అలానేవుంది. వాడిని లేపి తూలుతూ బయటకు వచ్చాము. ఎదురుగా రెండు సినిమా టాకీసులున్నాయి. ఒకదానిలో ఇంగ్లీషు—ఇంకో దానిలో తెలుగు. సినిమా చూస్తే నిద్రపోతుంది. అప్పుడు వచ్చి చదువుకోవచ్చు. శర్మ, శాస్త్రి దీని కంగీకరించారు. రెండు సినిమాల 'వాల్ పోస్టర్లు' జతచేసి చూసాము. తెలుగు ముందు ఇంగ్లీషు బలాదూర్. తెలుగు సినిమాకుపోవ నిశ్చయించాము.

సినిమాని రబ్బరులా, చ్యూయింగుగమ్ములా, ఉడకబెట్టిన బెండకాయ తీగలాగ సాగదీసి వదిలేసరికి ఒంటిగంటన్నరయింది. తిరుగు ప్రయాణం కట్టాము. శర్మ సైకిలు సారథ్యం వహించాడు. నేనెందుకైనా మంచిదని వెనకాల కూర్చున్నాను. శాస్త్రిముందు కూర్చుని ఆంజనేయ దండకం వల్లిస్తుండగా బండి కదిలింది. వీధులన్నీ నిర్మానుష్యంగా చిమ్మ చీకటిగా వున్నాయి. ఏం మున్సిపాలిటీ వాళ్లో ! ఒక్కోసారి పగలు పన్నెండయినా దీపాలు వెలుగుతూనే వుంటాయి. ఇలాంటప్పుడు

డవు. తప్పి పూర్ణుని గోత్రులో, అడ్డ దిడ్డంగా వేసిన కంకర్రాళ్ల మీద పడుతూ లేస్తూ బండిముందుకు దూసుకుపోతూంది. ఇంతలో సడన్ బ్రేకు పడింది. అదురుకు తూలి కిందపడ్డాను. శాస్త్రి దండకం ఒక్కక్షణం ఆగి తిరిగి ఎక్కువయి పోయింది. లేచి చూద్దునుకదా! నల్లటి ఓ ఆకారం కనిపించింది. ఒకవేళ శాస్త్రి దండకానికి మెచ్చి సాక్షాత్తు ఆ ఆంజనేయ స్వామి ప్రత్యక్ష మయ్యాడేమోనని చేతులు జోడించి అనుమాన నివృత్తికోసం పృష్ట భాగంవైపు చూసాను.

హనుమంతుడు కాడు ఎవరూకాదు గళ్ల పంచెకట్టి కోరమీసాలతో భీకరాకారం.

'మర్యాదగా డబ్బులు ముందు పెట్టండి' అరిచింది భీకరాకారం. 'డబ్బా. చిల్లిగవ్వ లేదు' శర్మ ధైర్యం పుంజుకొన్నాడు. నడుమున బొడ్లోంచి కత్తిలాగాడు. వణికి పోతూ జేబులు చూపించాము. ఏమను కున్నాడో ఏమో. ఓసారి బుర్ర గోక్కొని లాంతరెత్తిసి మా ప్యాంట్లపైన వేసాడు. 'ఇవి టెర్లిన్ ప్యాంట్లా ?' అడిగాడు.

ఎంతో డబ్బుపోసికొంటే ఇవి టెర్లి నాని అడుగుతాడా? నిజానికి వీడి తప్పేం లేదు. ఇంతకన్న బాగా కనిపించే గుడ్డలు బజార్లో రూపాయికి, రెండు రూపాయల కమ్ముతున్నారు. అయినా వీడి అనుమానం తొలగించాలి.

'ఇవి నూరుపైసల నిజమైన టెర్లిన్ వే నండి'. గర్వంగా అన్నాను.

'నాది రష్యాది. నాది అమెరికాది' శర్మ, శాస్త్రి కూడా తమగొప్ప చెప్పుకున్నారు.

'ప్యాంట్లు ఇప్పి ఇటివ్వండి' గర్జిం చాడు.

'ప్యాంట్లా...ఎందుకు ?'

'ఇస్తారా. ఇవ్వరా' కత్తి మీద కు లెత్తాడు. నేను, శర్మ గబ గబ విప్పిచ్చే సాము 'నీది' శాస్త్రి నుద్దేశించన్నాడు

'నావా...నేను డ్రాయరు...' నసిగాడు.

'అవన్నీ పనికిరావు. ముందివ్వు' గుడ్లెర్ర చేసాడు.

డ్రాయరులేదని అబద్ధంచెప్తే ఏమైనా వింటాడేమోనని శాస్త్రి వేసిన పథకం నిష్ఫలమయింది. చొక్కాలు ప్యాంట్లు అన్నీ తీసుకొని చీకట్లో కలిసిపోయాడు. పట్టి బనియన్‌లతో, డ్రాయర్లతో ఇంటికి చేరుకున్నాము, అప్పటి నుంచి రెండో ఆటకు పోకూడదని ఒట్టు పెట్టు కున్నాము.

బంగారంవంటి పాంట్లు పోయాయన్న దిగులుతో ఆరు నెలల పరీక్షలుకూడా పోగొట్టుకున్నాము.


మరి కొన్నాళ్లకు స్కూలుకు మాకు అధికార పూర్వకంగా ఋణంతీరే రోజులు వచ్చాయి. స్కూల్లో పెద్ద మీటింగు ఏర్పాటు చేసారు. ఓ చిన్నసైజు మంత్రి గారిని కూడా ఆహ్వానించాము. సాయంకాలం ఆరుగంటలకు సభ. అయితే అలవాటు, ఆన వాయితీ ప్రకారం ఆయన ఏడుగంటలకి కొచ్చారు. కాఫీ, టిఫిన్లు సేవించాక మొదలైంది కార్యక్రమం. మొదట మంత్రిగారు ఉపన్యాసం ఇచ్చారు, పాత చింతకాయ పచ్చడే. తరువాత తెలుగు మాస్టారుగారులేచి, 'మన పాఠశాల నవ యువ కవి శర్మ తను రచించిన పద్యములు చదువుతాడు' అన్నారు. శర్మ అందరివైపో సారిచూసి స్టేజిపైకి నడిచాడు.

ఫోటోగ్రాఫరు తన మెడలోని కెమెరా సవరించుకోటంచూసి తెలుగు మాస్టారు గబుక్కున మంత్రిగారి పక్కన కూర్చు న్నారు జిగేలుమని మెరుపు మెరిసింది. ఇది చూసి కడుపుమండిన హెడ్ మాస్టారు ఆయనకేదో పని పురమాయించి తన కుర్చీ దగ్గరగా వేయించుకున్నారు. తెలుగు మాస్టారు ఆపని ఇంకొకరికి అంటగట్టి అక్కడే బైఠాయించారు.

శర్మ మైకుముందు నిలచి గొంతు సవ రించాడు.

అవవతె నన్ను అధిపతి
కావలయు మంత్రి అనుమతి
లేనిచో తిరుపతే నీగతి
తెలుసుకోండీ జీవిత నీతి.

జనం ఒక్కసారి గొల్లుమన్నారు. వీడింకా ఈ...ఈ...అని దీర్ఘం తీస్తూనే వున్నాడు. మంత్రిగారి ముఖం ఎర్రగా కందగడ్డలా తయారయింది. 'ఎవర్రా సారీ మతిలేతి గీతి?' హెడ్మా తెలుగుకేసి గుర్రు మని చూసారు. తెలుగు శర్మకేసి మిర్రుర చూసారు! ఏమిటిలా రాసాడు? వ్రాసినా ఎలా చదవ గలిగాడు ధైర్యంగా? అందరూ ఆశ్చర్యపడ్డారు. శర్మ ఏమీ తొణకకుండా, 'నన్ను సరిగా అర్థం చేసుకోండి దీని అర్థ మేమిటంటే ఎంత గొప్పవాడైనాసరే మంగలి అనుమతి లేకుండా కుర్చీలో కూర్చుంటే వాడికి గుండుగీసే ప్రమాదం వుంది. ఇదేం తెలుపుతుందంటే భారత దేశంలో ప్రతి పనికి అనుమతంటూ వుం డాలని' తెలుగు సినీమా పాటల్లాగా రెండ ర్థాలతో వ్రాసిన వీడిని ఏమనాలో తెలియ లేదెవరికి.



శర్మ ఇంకో పద్యం అందుకున్నాడు.

మగువల కొంగులు
మగవారి అంగీలు
కృష్ణపక్ష చంద్రురీతిన
క్షీణించెనే శీఘ్ర గతిన

సభలో కలవరం బయలుదేరింది. మగ వారు చొక్కాలు బొడ్డుకిందకు లాక్కున్నారు. ఆడవారు కొందరు కోపంతో ముఖాలు ముడిచారు. మరి కొందరు నిండుగా పైటలు కప్పుకుందామనుకున్నారు కాని భుజమే దిగని ఆ కొంగులతో అది అసాధ్య మయింది. వీడింకొక పద్యం అందుకో బోయాడు కాని ఏం రభస జరుగుతుందో నని మాస్టార్లందరు కలసి వాడినికిందకు లాగేసారు.

పబ్లిక్కు పరీక్షలు దగ్గర పడుతున్నాయి. ఇంకొన్నుంటే మహా నెలవుంటుంది. కాని ఎంత చదివినా బుర్రకెక్కనిదే పైగా అశోకుడిపైన అక్బరుపైన కోపంకూడ వచ్చింది. అసలు వీరెందుకు పుట్టారు? అప్పటివాళ్ళకి కుటుంబ నియంత్రణ తెలియదూ? పోనీ పుట్టారయ్యా. ఈ పనులన్ని ఎవరు చేయమన్నారూ?

వెనక సోషలుపుస్తకం ఇంత లావుండ టమా? 1969 కే ఇంత లావుగావుంటే ఇంక 2069 కి ఎంత లావుంటుందో! పాపం వాళ్ళెన్ని గుర్తుంచుకోవాలో. జాలి పడ్డాము. ఇంతలో ఓ ఉపాయం తట్టింది. 'ఒరేయ్' గట్టిగా అరిచాను.

ఉలిక్కిపడ్డారిద్దరూ. 'ఏ మొచ్చిందిరా?'

'పూర్వం ఋషులు వేదాలు రాగ యుక్తంగా నేర్చుకొనేవారు. అవునా?'

'అవును' వాళ్ళు చిరాగ్గా చూశారు.

'అలానే మనమెందుకు మన పాఠాలు సినిమా పాటల రూపంలో నేర్చుకో కూడదూ?' వ్వాట్! ఇంత తెలివైన ఆలోచననే చేసినందుకు, అది వాళ్ళకు తట్టనందుకు, ఆనందపడి, విచారపడి రవ్వాకాశానికి ఎత్తి, కింద పారేశారు.

'మొదట అశోకుడుచేసిన పనులను పాటలరూపంలో కడదాం. ఏపాట పెడితే బాగుంటుం దంటారు?' అడిగాను.

'గుండమ్మ కథలోనిది' శాస్త్రి ఉత్సాహంగా అరిచాడు.

'హోరుమ్మయ్యాయ్. మూగమనస్సులోంది

## కుదురు లేని...

పట్టాలి' కయ్యాకి దిగాడు శర్మ.

'ఆగండ్రా నేను చెప్పేది వినండి.' అత్తా ఒకింటికోడలే 'సినిమాలో' అశోక వనమున సీతా పాటతెలుసా' నేను కల్పించుకోక తప్పలేదు.

'తెలీకేం. శోకించి వియోగముచేత' శాస్త్రి అందుకున్నాడు

'ఆగాగు. అలాగే అశోకుడను మహ రాజా కట్టించె గృహములనంతా.'

బాగుంది బాగుంది ఇదరు మెచ్చుకున్నారు.

ముగ్గురం పాఠాలన్నీ, పాటలరూపంలో పాడుకోసాగాము. ఇంతలో మా నాన్న పరిగెత్తుకొచ్చాడు. చదువుకోండంటే సినిమాపాటలు పాడతారా అని స్నేహితులున్నారని లేకుండా లెంకిజెల్ల కొట్టేశాడు.

ఛీ ఛీ. ఏం లోకమో మంచిపనుల కెపుడూ ఆటంకమే కదా! పరీక్షలు దగ్గరయ్యేకొలది శర్మ గడ్డాలు, మీసాలు పెంచటం మొదలెట్టాడు. ఇంట్లో లిరుపతి మొక్కని చెప్పాడుగాని వాడసలి వుద్దేశ్యంవేరు. ఇలా గడ్డాలు మీసాలుపెంచి రవుడిలా తయారవుతే వాచర్లెవరూ వీడి దగ్గరకురాదట. వీడు స్వేచ్ఛగా కాపీలు కొట్టుకోవచ్చట. నేను, శాస్త్రి అలా తయారవుదామని కేశాలుపెరిగే తైలాలు రోజూతెచ్చి పట్టించసాగాము. రాలేదు సరికదా వున్నదికూడా వూడటం మొదలెట్టింది. ఆ ప్రయత్నం విరమించాము.

పరీక్షలు వచ్చాయి. ఆపరేషను కన్న, థియేటరులోని కత్తులు కటార్లు చూస్తే భయం ఎక్కువ. అలానే పరీక్షకన్న దానికి చేసిన హంగామాచూసి చాలామంది జడుసుకున్నారు. ఇంగ్లీషు తెలుగు స్వంత తెలివితో లాగేసాము. లెక్కలు పక్కవాడిది చూసి ఎక్కించాము. సోషలు స్టడీస్ నాడే బండికి గండం. మేమనుకున్న ప్రశ్నలు రెండోమూడో వచ్చాయి. అశోకుడుచేసిన పనులు వివరించమని ఒకప్రశ్న పాట గుర్తుకు తెచ్చుకున్నాను. అశోకుడను మహారాజా...ఆ తర్వాత 'శోకించె వియోగము చేత తప్పించి అసలుమాట గుర్తుకు రాలేదు. ఒకప్రశ్నకు మర్చిపోయి సినిమా పాటే వ్రాసేసాను. శర్మ, శాస్త్రిలవేపు చూసాను వాళ్ళఅవస్థ వాలానే ఉంది.

ఇంకో ఆయుధం ప్రయోగించాను. జేబులోంచి కొయితంతీసి వ్రాస్తున్న కాగితాలకింద దాచాను. కాళ్ళు చేతులు విపరీతంగా వణికిపోతున్నాయి. వాచరు నా దగ్గరకు వచ్చారు. 'ఎందుకలా తాళం వేస్తున్నావ్?'

అందరూ నావేపు తిరిగారు 'నేనా?' ఈ అభాండం సహించలేక పోయాను. 'చెప్తే నీ క్కాదూ' రెట్టించాడు వాచరు. కాళ్ళకేసి చూసాను అప్పుడర్థమయింది. అది 'డప్పు'కాదని కాళ్ళు వణకుతూ బల్లకు చేస్తున్న చప్పుడని బల్లకు కాళ్ళు అదిమించాను.

వాచరక్కడనుంచి పోగానే కాయిలాలు ఎత్తి కాపీ చూస్తూ మెల్లగా వ్రాయసాగాను. ఇంతలో పెద గాలి వీచింది.

కాపీ కాస్తా ఎగిరి గాలిలో అలా అలా తేలుతూ వాచరు మొహానికి అతుక్కుంది. కుక్కిన పేనులా వుండిపోయాను.

ప్రపంచ పటమిచ్చి చైనా రాజ్యాన్ని పాకిస్తాను రాజ్యాన్ని గుర్తించమంటారు. ఎక్కడని గుర్తించడం? వాళ్ళు రోజుకొక గ్రామాన్ని కొల్లగొడుతూ ఆక్రమిస్తున్నారే. పైగా పెద్ద పెద్ద వాళ్ళకే సరిహద్దు సమస్యలు అర్థంకాకుండా చస్తున్నారు. మమ్మల్ని గుర్తించమనటం ఎంత అన్యాయం?

బిట్‌పేపరు అని ఇంకో టిచ్చారు. బీహారు ముఖ్యమంత్రి ఎవరు? పంజాబు ముఖ్యమంత్రి ఎవరు? రోజుకొక మంత్రి మారే రోజుల్లో యీ చచ్చుప్రశ్నలేమిటి? ఇంకోటి చూద్దామనుకుంటే అదీ అలానే ఏడ్చింది. మనదేశములోని రాష్ట్రములెన్ని? ఎప్పుడెన్ని అవుతాయో తెలియదు. పదిహేడుఅని వ్రాసి బ్రాకెట్‌లో డెబ్బయిఏడు కావచ్చును. అని వ్రాశాను. సాంబారు లేకు ఎక్కడుంది? అమాత్రం తెలియదూ ఉడిపిహోటళ్ళలో పెద్ద గంగాళం నిండా చేసి పెడతారు. అదే వ్రాసాను.

బయటకు వచ్చినతరువాత మా ఫలితాలు ముందే తెలిసినట్టనిపించింది. ఆడుతూ, పాడుతూ రోజులు క్షణాలుగా గడిపేశాము.

'రేపే మనపరీక్ష ఫలితా లొస్తాయట'

శర్మ పరిగెత్తుకొచ్చాడు.

'రేపా? ఎవరు చెప్పారురా' శాస్త్రి కంగారుగా అడిగాడు. వాడికప్పుడే భవిష్యత్తు తెలిసినట్లయి గొంతులో ఏడుపు జీర కలిసింది.

'నిండా మునిగినవాడికి చలేమిట్రా' శర్మ విసుక్కున్నాడు. శాస్త్రిని చూస్తే జాలేసింది. 'ఆ పేపర్లు తీసుకొచ్చే రైలు పడిపోతుందిరా: రోజూ ఎన్నిరైళ్లు పడుతున్నాయో మనం పత్రికలలో చూడటం లేదూ' భరోసా ఇచ్చాను. అయినా లోపల్లో భయంగానే వుంది:

'రేపు జ్వరంతో పడుకుంటె చివాట్లు వాయిదా పడతాయేమో!' శాస్త్రి అన్నాడు.

'అదీ బానేవుంది, కాని జ్వరం రావటం ఎలా?' నా సందేహం.

'ఉల్లిచేయుమేలు తల్లికూడా చేయదని మీకు తెలుసా?' శర్మ అడిగాడు మమ్మల్ని.

'తెలియదు' ఒప్పుకున్నాము.

'అయితే వినండి బాష్పవాయువు నుంచి తప్పించుకోవాలన్నా జ్వరం రావాలనుకున్నా ఇది అమోఘంగా పనిచేస్తుంది' శర్మ చెప్పిన విధంగానే చేతులకింద ఉల్లిపాయ లుంచుకు పడుకున్నాము. కాని నిద్దట్లో అవెక్కడో జారిపోయాయి.

మర్నాడు త్వరగా లేచి రిజల్ట్సువస్తే భోజనాలు దొరకవని ముందుగానె భోంచేసేసాము. ముగ్గురు పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నాము. ఎంతసేపటికి పేపరురాలేదు.'

'నే చెప్పలేదురా ఆ బండెక్కడో హరీ అంటుందని. రండి పోయి గోటీబిళ్ల ఆడుకుందాం.

ముగ్గురు బయటకు పరిగెత్తబోయాము. గుమ్మంలోనే నాన్న పేపరుచ్చుకు కనబడ్డాడు.

'మీ నెంబర్లెంతరా?' పోయిందని తెలుస్తే వీధిలోనే పళ్ళుకు తిట్టేస్తాడని మా తరగతిలో పాసవుతాడన్న ధీమాగంవాడి నెంబరు చెప్పాను. శర్మ శాస్త్రి ఇంటికి జారుకున్నారు.

నాన్న పేపరుచూసి 'గోవిందా గోవిందా' వెటకారంగా అరిచాడు. నా నెంబరదికాదని అసలు నెంబరు చెప్పాను. ఓసారి కోపంగా చూసి 'పైకెక్కిందిరా' అన్నాడు. నేను పాసయ్యానా? నమ్మకం కుదరలేదు. 'ఎక్కడ' అన్నాను ఆత్రుతగా.

'కొండపైకిరా నీ నెంబరు వేయటానికి ఇక్కడ చోటులేదట. అయినా నీకు చదువేం అబ్బుతుందిరా' అని తిట్టి తిట్టి అలిసిపోయి వగరుస్తు కుర్చీలో కూర్చున్నాడు ఇంతలో మా అమ్మ వచ్చింది.

తల్లులెప్పుడు తనయులవైపే! నా పరీక్ష పోయిందని తెలుసుకొని 'వెధవ పరీక్ష పోయినందుకా ఇంత రాద్ధాంతం చేస్తున్నారు. వచ్చేసారి ఫస్టున పాసయి మంచిఉద్యోగం చేస్తాడు' అంది.

'ఆ చేస్తాడు పెద్ద ఉద్యోగం' నాన్న ఉత్తరీయం దులిపాడు. మళ్ళీ అందుకున్నాడు' 'ఈ ఎస్సల్సీ ఫెయిలుకు ఎవరూ బంట్రోతు వుద్యోగంకూడా ఇవ్వరు'

'ఏం ఎందుకు?' అమ్మడిగింది.

'కొంచెం మిడిమిడి జ్ఞానంకదూ నీళ్లు తోడమన్నా బట్టలు పిండారేయమన్నా రూల్సు రూల్సు అంటారు అందుకని'

'మరి నన్నెందుకు మూడో క్లాసుతోనే ఆపేయలేదు? అసలే ఉద్యోగాలు దొరకని కాలంలో అప్పుడే ఒక ఉద్యోం పోయినందుకు విచారంవేసింది. దీనివలన ఓసత్యం బోధపడింది. ఎక్కువ చదివినా ఉద్యోగాలు దొరకవు.

'నోరు మూసుకొని వెళ్లి సెప్టెంబరుకు చదువుకో' అరిచాడాయన నోరు మూసుకు నెట్లాలని అడుగువామనుకున్నా గాని నీ అతితెలివి నాదగ్గరకాదు మనసులో చదువుకో అంటాడేమోనని వూరుకున్నాను.

మర్నాడు ముగ్గురు ఇంట్లో సమావేశమయ్యాము. ఏడాది పోయిందంటే విచారం వేసి రెండు నిమిషాలు మవునం పాటించాము. ఆ తరువాత పరీక్ష పోవటానికి కారణాలు వెదికాము, కుదురుగా కూర్చుని ఒక్కగంటయినా చదివామా? కుదురు రాకపోవటానికి కారణం ఏమిటి? ఆ ఇప్పుడు గుర్తుకు వచ్చింది. ఒక్కరోజయినా చదవటానికిముందు దేవుడిని తలచుకున్నపాపాన ...పాపం శమించుగాకపుణ్యానపోయామా?

మా ముగ్గురికి వడుగయింది. కాని ఒక్కరికి సంధ్యకాదుకదా కనీసం గంజి వార్చటంకూడా చేతకాదు. శర్మ జందెం ఎప్పుడూ మొలతాడు కుంటుంది. నదిస్టాండుకు వేలాడుతూంటుంది. శాస్త్రిది పోనేపోయింది. ఇంట్లోవాళ్లకు తెలియకుండా ఎప్పుడు బనియనుమీదే వుంటాడు.

చేసిన తప్పులకు లెంపలేసుకున్నాము: వినాయకుని పూజించకుండా మొదలెట్టినందుకు ఏపనీ సక్రమంగా జరగలేదు. ఈసారి ముందుగా విఘ్నేశ్వరుని పూజించి చదువు మొదలుపెట్టాలని దృఢ నిశ్చయానికి వచ్చాము. శర్మ గణపతిపై పద్యాలు వ్రాయటానికి కూర్చున్నాడు. నేను శాస్త్రి వినాయకుని పటం పూలు పండ్లు తీసుకు రావటానికి బజారుకు బయలుదేరాము. ●

